www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 13 జూన్ 2025
5
కాకినాడ



భూసార పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రైతులందరూ విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఎల్‌కె.ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని సిరిపురంలో గురువారం రైతు సదస్సులో వారు మాట్లాడారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల రైతులు ఏ పంటలు వేసుకోవాలి, తేమ శాతం ఎంత ఉండాలి, ఏయే సమయాల్లో ఎరువులు వినియోగించాలి అనే విషయం తెలియడం వల్ల రైతులకు పెట్టుబడి తగ్గి అధిక లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పీతల సూరకాజు, ఉప సర్పంచ్ మజ్జురి రామలింగేశ్వరరావు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కూలి ఇప్పించండి సారూ..!

- 9 వారాలుగా అందని వేతనాలు
- రూ.42 కోట్లకు పైగా బకాయిలు
- పస్తుల్లో 'ఉపాధి' కూలీలు
- అప్పులు కూడా పుట్టక అవస్థలు



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు గుర్రాల రాముడు... కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం పొన్నాడకు చెందిన రోజువారీ కూలీ. వ్యవసాయ పనులు కూడా లేకపోవడంతో ఉపాధి పనులనే నమ్ముకున్నాడు. ఆరు వారాలుగా పని చేశాడు. రూ.9వేలకుపైగా కూలి డబ్బులు రావాల్సి ఉంది. నేటికీ ఒక్క రూపాయి కూడా రాలేదు. దీంతో కుటుంబ పోషణ నిమిత్తం అప్పులు చేశాడు. బడులు తెరవడంతో పిల్లల ఖర్చులు వచ్చి పడ్డాయి. చేతిలో చిల్లి గవ్వలేదు. ఉపాధి కూలి అందితే పిల్లల ఖర్చులు, అప్పులు తీర్చుకుందామని చూస్తున్నాడు. బ్యాంకుకు వెళ్లి రోజూ ఆరా తీస్తున్నాడు. నేటికీ రూపాయి కూడా అందకపోవడంతో ఏం చేయాలో తెలీక అయోమయంలో పడ్డాడు... ఇది ఒక్క రాముడు కుటుంబానికి కలిగిన ఇబ్బందే కాదు.. జిల్లాలోని అందరి ఉపాధి కూలీల పరిస్థితి ఇలాగే ఉంది....



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, యంత్రాంగం

ప్రస్తుతం వ్యవసాయ పనులు ఎక్కడా లేవు. రబీ సీజన్ ముగిసి ఖరీఫ్ ప్రారంభమైనప్పటికీ కాలువల నుంచి నీరు రావడం లేదు. వర్షాలు కురవడం లేదు. దీంతో వ్యవసాయ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకం ఆదుకుంటుంది అని ఆశిస్తే వ్యవసాయ కార్మికులకు ఈ పథకం అక్కరకు రాకుండా పోతోంది. చేసిన పనులకూ కూలి చెల్లించకపోవడంతో వారు ఉసూరు మంటున్నారు. వారాల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో పస్తులతో కాలం వెళ్లదీస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిందంటూ సంబరాలు చేసుకుంటున్న నాయకులకు, తాము కనిపించట్లేదా? అని వారు ప్రశ్నిస్తున్నారు.

కాకినాడ జిల్లాలో 20 మండలాల్లో 385 గ్రామ పంచాయతీలుండగా 2.74 లక్షల జాబ్ కార్డులున్నాయి. 4.48 లక్షల మంది కూలీలున్నారు. వీరిలో రెగ్యులర్‌గా 3.15 లక్షల మంది పని చేస్తున్నారు. ప్రస్తుతం సుమారు 52వేల మంది పని చేస్తున్నారు. ఎండలు తీవ్ర స్థాయిలో ఉన్నా పొట్ట కూటికోసం పనులకు వెళుతున్నారు. అక్కడ సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం ఇప్పటికే విఫలమైంది. కనీసం టెంట్ల సౌకర్యం కూడా లేదు. తాగునీటిని ఇళ్ల వద్ద నుంచి తెచ్చుకుంటున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కష్టపడుతుంటే రూ.250 మించి వేతనం రావడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం 9 వారాలుగా ఉపాధి వేతనాలు పెండింగ్ ఉన్నాయి. రూ.42.50 కోట్ల మేర బకాయిలు విడుదల కావాల్సి ఉంది. ఏడాదికాలంగా వారాల తరబడి కూటమి ప్రభుత్వం బకాయిలను పెండింగ్‌లో పెట్టడంతో వ్యవసాయ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తక్కువ వేతనమే అయినా కుటుంబ పోషణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో పనులకు వెళుతుంటే వీటిని కూడా పెండింగ్లో పెట్టడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. తొమ్మిది వారాలుగా వేతనాలు ఇవ్వకపోవడం వల్ల కుటుంబ పోషణ కోసం అప్పులు చేద్దామన్నా పుట్టని దుస్థితి ఏర్పడిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రతి మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

రౌతుల పూడిలో..

రౌతులపూడి మండల వ్యాప్తంగా మే నెల చివరి వరకు 1,25,259 మంది కూలీలకు రూ.4.49 కోట్ల వరకూ కూలీలకు బకాయిలు ఇవ్వాల్సి ఉంది. రెండు నెలలుగా ఉపాధి సొమ్ములు జమ చేయకపోవడంతో కూలీలు ఆర్థికపరమైన ఇబందులను ఎదుర్కొంటున్నారు. పాఠశాలలు ప్రారంభించే సమయం కావడంతో పిల్లల ఫీజులు, పుస్తకాలు కొనుగోలు చేయాల్సి రావడంతో డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు.

పెద్దాపురంలో...

పెద్దాపురం మండలంలో ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ప్రభుత్వం రూ.3.64 కోట్ల వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించడం లేదు. మండలంలో 23 గ్రామాల్లో 9,945 జాబ్ కార్డులున్నాయి. వీటి ద్వారా 12,632 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఇతర పనుల్లేక చేసిన ఉపాధి పనులకు డబ్బులు చేతికందక నానా ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక అప్పులు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ప్రస్తుతం అప్పులు కూడా పుట్టే పరిస్థితి లేదని వాపోతున్నారు.

యు.కొత్తపల్లిలో...

డిప్యూటీ సిఎం నియోజకవర్గమైన యు.కొత్తపల్లి మండలంలో 4,295 మంది కార్డుదారులు ఉపాధి పనులు చేస్తున్నారు. వీరికి రోజూ సగటున ఒక్కొక్కరికి రూ.305 వరకూ వేతనం వస్తుంది. ఈ లెక్కన నెలకు రూ.3.6 కోట్ల వరకూ చెల్లించాలి. రెండు నెలలుగా వేతనాల చెల్లింపులన నిలిపేశారు.

మండలంలో కూలీలకు రెండు నెలలకు సుమారు రూ.7.2 కోట్ల వరకు ఉపాధి వేతనాలు చెల్లించాల్సి ఉంది.

గండేపల్లిలో...

మండలంలోని 18 గ్రామాల్లో 7,153 కుటుంబాలకు జాబ్ కార్డులున్నాయి. వీటి పరిధిలో 9,209, మంది కూలీలు పనిచేస్తున్నారు. ఏప్రిల్ నుంచి నేటి వరకూ పనులు చేసినా వీరికి వేతనాలు చెల్లించలేదు. నేటికి రూ.5.02 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. పని ప్రదేశాల్లో కనీస వసతులు కూడా కల్పించట్లేదని కూలీలు చెబుతున్నారు. దీనిపై ఎపిఒ మాట్లాడుతూ 10 వారాలకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఐదేళ్ల నుంచి పరికరాలు, టెంట్లు అందించట్లేదన్నారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ 1,85,751, పని దినాలు కల్పించామని తెలిపారు.

కోటనందూరులో...

కోటనందూరు మండలంలో 613 ఉపాధి హామీ కూలీల గ్రూపులు ఉన్నాయి. ప్రతిరోజూ 2,500 నుంచి 2,700 వరకూ కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. 2 నుంచి ఐదు వారాలకు సంబంధించిన వేతనాలు అందట్లేదని కూలీలు చెబుతున్నారు. మెట్ట ప్రాంతం కావడంతో పనులు దొరకట్లేదని, చేసిన పనికి కూలి చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని కూలీలు వాపోతున్నారు. పని ప్రాంతంలో టెంట్లు, తాగునీరు వంటివి ఏర్పాటు చేయాలని, పరికరాలను అందించాలని కూలీలు కోరుతున్నారు. మరో పక్క సిబ్బంది కొరత వేధిస్తోంది. లక్ష్మీదేవి పేట, పాత కొట్టాం, కెఎ.మల్లవరం గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడం వల్ల సీనియర్ మేట్లతోనే ఫీల్డ్ అసిస్టెంట్ విధులను నిర్వహిస్తున్నారు.

పనులు చేయించి.. కూలి ఇవ్వట్లేదు...



ఉపాధి చట్టంలో భాగంగా పనులు చేయిస్తున్నారు. కూలి మాత్రం ఇవ్వట్లేదు. ఏడు వారాలకు సంబం ధించిన కూలీ నేటికీ ఇవ్వలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. గతేడాదిలో మూడు నెలలకు సంబంధించిన కూలి సొమ్ములు నేటికీ చెల్లించలేదు. ఉపాధి పనులు కల్పిస్తున్నామంటూ నాయకలు ప్రచారం చేసుకుంటున్నారు తప్ప, మా కూలి కోసం మాత్రం మాట్లాడటంలేదు. అధికారులు, నాయకులు స్పందించి సకాలంలో కూలి అందేలా చూడాలి.

- వడిశెట్టి గోవిందరెడ్డి, పొన్నాడ

బకాయిలు విడుదల చేయాలి



ఉపాధి పథకం మాలాంటి సామాన్య కుటుంబాలను ఆదుకుంటుందని గతంలో కేంద్ర ప్రభుత్వం దీనిని ప్రవేశపెట్టింది. కాని ఇప్పుడున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వల్ల వేతనాలు సకాలంలో అందడం లేదు. దీని వల్ల అప్పులు చేయాల్సి వస్తుంది. చాలా మందికి అప్పులు కూడా పుట్టక కుటుంబ పోషణ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలి.

- వెల్లంకి శ్రీను, ఉపాధి కూలీ, వాకతిప్ప, యు. కొత్తపల్లి మండలం

ప్రతి గ్రామంలోనూ ఇదే పరిస్థితి



వారం రోజుల నుండి ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న సుమారు ఎనిమిది గ్రామాల్లో సర్వే చేశాం. అక్కడ పనిచేస్తున్న శ్రామికుల కష్టాలు అడిగి తెలుసుకున్నాం. సుమారుగా రెండు నెలల నుంచి ఉపాధి పనులను కూలీలు చేస్తున్నారు. కాని వారికి వేతనాలు మాత్రం చెల్లించట్లేదు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు గాని, తాగునీటి సదుపాయం గాని లేదు. పనిముట్లు ఇవ్వడం లేదు. కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి. లేకుంటే కూలీలతో కలిసి ఉద్యమిస్తాం.

- కె.నాగేశ్వరరావు, సిఐటియు, మండల అధ్యక్షుడు, యు.కొత్తపల్లి

కూలి చెల్లించట్లేదు...



ఉపాధి కూలి సకాలంలో సక్రమంగా చెల్లించట్లేదు. ఫలితంగా నానా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సార్లు ఆకలితోనే ఉండాల్సి వస్తుంది. నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తుంది. పనులకు సంబంధించి కూలి వెంటనే చెల్లించాలి.

- కె.కృష్ణ, ఉపాధి కూలీ, అల్లిపూడి, కోటనందూరు మండలం

రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలి



ఉపాధి కూలీలకు రోజువారీ కనీస వేతనం రూ.600 అయినా చెల్లించాలి. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ ధరలకు అనుగుణంగా కూలి పెంచాలి. పని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలి.

- ఎస్‌కె.పద్మ, సిఐటియు నాయకురాలు, కోటనందూరు

వికసిత్ భారత్ కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

ప్రజాశక్తి-కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

2047 నాటికి వికసిత భారత్ లక్ష్యంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం లక్ష్యంగా పని చేస్తోందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ఎన్నో నిధులను విడుదల చేసి పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. గురువారం కాకినాడలో దేవాలయం వీధిలో ఉన్న శ్రీనివాస కల్యాణం మండపంలో వృత్తి నిపుణుల సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లు అవుతోందని, ఈ కాలంలో చేసిన కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. 18 వేల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామని, ఇంకా రోడ్లు, జాతీయ రహదారి వంటివి నిర్మించామని చెప్పారు. రాష్ట్రాభివద్ధికి కేంద్రం రూ.లక్షల కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో ఎనిమిరెడ్డి మాలకొండయ్య, తుమ్మల పద్మజ, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, వేటుకూరి సూర్యనారాయణ రాజు, రావూరి సుధా, పైడా కృష్ణమోహన్, వెంగమాంబ శ్రీనివాసరావు, రామ్మోహన్ రావు, డివి.సూర్యనారాయణ రాజు, వి.ఉమామహేశ్వరి, పైడా భవన ప్రసాద్, సింగిలిదేవి సత్తిరాజు, యార్లగడ్డ రామ్ కుమార్, కె.భీమశేఖర్, కుండల సాయికుమార్, చక్కా రమేష్, దిలీప్ కుమార్ సదనాని, గౌతు చిన్నా తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ జవహర్

సుబ్రహ్మణ్యం హత్య కేసు పునర్విచారణ చేయిస్తాం

ఎస్‌సి కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్

ప్రజాశక్తి -పెదపూడి

గత వైసిపి ప్రభుత్వంలో ఎంఎల్‌సి అనంత బాబు డ్రైవర్ విజి.సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన సంఘటనపై పునర్విచారణ చేయిస్తామని ఎస్‌సి కమిషన్ చైర్మన్ కెఎస్.జవహర్ స్పష్టం చేశారు. గురువారం మండలంలోని గొల్లలమామిడాడలో సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగా ఉన్న వ్యక్తి హత్య చేయడం హేయమైన చర్య అన్నారు. కుటుంబ సభ్యుడిని కోల్పోయిన వారి పరిస్థితి, వారి జీవనోపాధి గురించి వాకబు చేశారు. వాళ్లకు ఇల్లు లేకపోవడం, కేటాయించిన స్థలంలో నిర్మాణ విషయంలో ఇబ్బందులు ఎదురవటం గురించి తహశీల్దారు, ఎంఎల్‌ఎ రామకృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యను సత్వరం పరిష్కరించాలని, సుబ్రహ్మణ్యం తల్లికి ఉపాధి కల్పించాలని ఆదేశించారు. సుబ్రహ్మణ్యం హత్య కేసు పునర్విచారణ, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలపై ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. లీగల్ టీమ్‌ను కూడా ప్రత్యేకంగా నియమించిందన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తికా-జులూరు



తాగునీరు పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం మండలంలోని దుగ్గుదుర్రు శివారు పాలమూరుపాడు దళితవాడలో దశాబ్దన్నర కాలంగా తాగునీటికి నోచుకోకపోవడంతో మంత్రి సుభాష్ చొరవతో నిధులు వెచ్చించి గురువారం సరఫరా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక సౌకర్యాల కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, గతంలో పని చేసిన మంత్రులు తాగునీటి పంపిణీకి ఆసక్తి చూపకపోవడం గమనార్హం అన్నారు. గ్రామంలో సుమారు 30 మీటర్ల రోడ్డు నిర్మాణానికి, లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాలకు నీరు వెళ్లకుండా అడ్డగిస్తున్న ఒక రైతుపై చర్యలు తీసుకోవాలని రైతులందరూ ఆర్‌డిఒకు వినతిపత్రం అందించడం ద్వారా సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిడిఒ జె.రాంబాబు, సర్పంచి పోతు వెంకటలక్ష్మి జ్యోతి కుమార్, సాగునీటి పంపిణీ సంఘం అధ్యక్షులు లఖాని కృష్ణ చైతన్య, దాట్ల విజయ గోపాల రాజు, నామవానిపాలెం సర్పంచ్ భూపతిరాజు చిట్టి రాజు, టిడిపి మండల అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యా సంస్థలు

ప్రజాశక్తి-కాకినాడ



అన్ అకాడమీ కాలేజీ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల ధర్నా

నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నారాయణ జూనియర్ కళాశాల, అన్ అకాడమీ విద్యా సంస్థల వద్ద గురువారం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాతో స్పందించిన ఇంటర్మీడియట్ జిల్లా అధికారి డివైఇఒ శారద నారాయణ జూనియర్ కళాశాలకు వచ్చి పుస్తకాలను సీజ్ చేశారు. ఈ కళాశాలకు ప్రభుత్వ అనుమతి లేదని, అనుమతులు వచ్చేవరకూ కళాశాల నిర్వహించవద్దని ఆదేశించారు. ఈ ధర్నాలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీకాంత్, ఎం.గంగాసూరిబాబు మాట్లాడారు. ఈ ధర్నాలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు సిద్దు, మణికంఠ, సాహిత్, అరుణ కుమార్, లోవరాజు, నాని, చిన్ని, గమినివేలు, అనిల్ పాల్గొన్నారు.

అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -సామర్లకోట



ఎన్నికైన దుప్పట్ల వర్తక సంఘం నూతన కార్యవర్గం

ప్రభుత్వాసుపత్రిలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని శ్రీ శివశంకర దుప్పట్ల వర్తక సంఘం అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో సంఘం 41వ మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసం అల్ట్రాసౌండ్ సౌకర్యం అవసరమని తెలిపారు. ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సిఐటియు మండలాధ్యక్షుడు బాలం శ్రీనివాస్ పాల్గొన్నారు. నూతన అధ్యక్షునిగా కరణం శ్రీనివాసరావు, కార్యదర్శిగా కరణం సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా కత్తిరి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా గుడ్ల నారాయణరావు, కోశాధికారిగా పోతుల శ్రీనివాస్, సభ్యులుగా పెంకే వెంకట రాజేష్, కరణం గోవిందరాజు ఎన్నికయ్యారు. ఈ సభలో తుటిపాటి రాజు, తలరాపు నర్సారావు, సప్ప సత్తిబాబు, పిఎస్.నాయుడు, బాలం సత్తిబాబు, ఇదిబిల్లి ప్రసాద్, పారినాయుడు శ్రీను పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వివిఎస్‌లో క్రమశిక్షణతో కూడిన విద్య

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

వివిఎస్ విద్యాసంస్థల్లో క్రమశిక్షణతో కూడిన, ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నామని విద్యా సంస్థల అధినేత అనిశెట్టి కృష్ణారెడ్డి తెలిపారు. సువిశాల ప్రాగణంలో విశాలమైన తరగతి గదులతో సొంత భవన సముదాయంలో పాఠశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనుభవం, అంకితభావం గల అధ్యాపకులతో బోధన అందిస్తున్నామన్నారు. నిపుణులతో రూపొందించిన విద్యా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. వివిధ పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధులను చేస్తున్నామన్నారు.



విద్యతో పాటు ఆటపాటల్లోనూ తగిన తర్ఫీదు ఇస్తున్నామన్నారు. యోగా, కరాటే, క్లాసికల్ డ్యాన్స్, డ్రాయింగ్ వంటి వాటిలో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు అత్యాధునికమైన లైబ్రరీ అందుబాటులో ఉందన్నారు.



వివిఎస్ విద్యాసంస్థల్లో నర్సరీ నుంచి డిగ్రీ వరకు విద్య అందుబాటులో ఉందన్నారు. ఇంటర్‌లో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి వంటి గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. డిగ్రీలో బిఎస్‌సి మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్స్, బికాం వంటి గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు, వివిఎస్‌లో నర్సరీలో చేరిన విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసి పట్టాతో బయటకు వచ్చే విధంగా విద్యావిధానం అందుబాటులో ఉందన్నారు. తక్కువ ఫీజులతో మెరుగైన విద్యను అందించడమే తమ లక్ష్యమన్నారు. తమ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించి ఎంతో మంది నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకొని పిల్లల భవిష్యత్తుకు పునాది వేసే దిశగా తల్లిదండ్రులు ఆలోచించి వివిఎస్‌లో చేర్పించాలన్నారు. తక్కువ ఫీజుతో అందిస్తున్న నాణ్యమైన విద్యను ఉపయోగించుకోవాలన్నారు.



విద్యార్థులకు ఐఐటి ఫౌండేషన్ ప్రోగ్రామ్స్

6,7,8,9, తరగతుల విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరంలో ఐఐటి ఫౌండేషన్ కోర్సులతో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని కృష్ణారెడ్డి తెలిపారు. అలాగే కాలేజీ విద్యార్థులకు జెఇఇ మెయిన్స్, నీట్, ఎపి ఇఎపిసెట్‌కు సంబంధించి ఫౌండేషన్ తరగతులు నూతన సిలబస్‌కు అనుగుణంగా ప్రవేశపెట్టామన్నారు.

వివిఎస్ విద్యాసంస్థల ప్రత్యేకతలు

- సువిశాల ప్రాగణంలో విశాలమైన తరగతి గదులతో సొంత భవన సముదాయం
- అనుభవం, అంకిత భావం గల అధ్యాపకులతో విద్యా బోధన
- సకల సదుపాయాలతో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ
- ప్రత్యేక యాప్ ద్వారా విద్యార్థుల హాజరు, సిలబస్, ఎగ్జామ్ టైం టేబుల్, మార్క్స్ వంటి సమాచారం తల్లిదండ్రులకు అందజేత
- ఎల్ఇడి టివీలతో ప్రత్యేక విద్యాబోధన
- కరాటే, ఆర్చరీ, క్లాసికల్ డ్యాన్స్, ఆర్ట్స్, క్రాఫ్ట్‌లో ప్రత్యేక శిక్షణ
- ఒత్తిడి లేని విద్యా బోధన, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- నైతిక విలువలను పెంపొందిస్తూ వ్యక్తిగత విద్యా బోధన

నేరాలు ఘోరాలు

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఒక మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి, ఆమె బంధువుపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు. రామచంద్రాపురం గ్రామానికి చెందిన కొడవటి పోసమ్మ గత నెల 31న తన ఇంటి సమీపంలోని చర్చిని శుభ్రం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన బరకటి నాగేశ్వరరావు తన సెల్‌ఫోన్‌లో ఆమెను వీడియో తీశాడు. ఈ విషయమై వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. వివాదాన్ని ఆపడానికి పోసమ్మ మేనకోడలు అక్కడికి రాగా, నాగేశ్వరరావు ఆమెపై దాడి చేశాడు. ఆమె దుస్తులను చించేశాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

1,268 కేజీల బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - రాజానగరం

స్థానిక జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న 1,268 కేజీల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల అధికారులు స్వాధీనం గురువారం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో అధికారులు జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే తణుకు నుంచి జగ్గంపేటకు బొలెరో వాహనంలో పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. బియ్యాన్ని సీజ్ చేశారు. వీటి విలువ రూ.58,328 ఉంటుందన్నారు. ఎంఎస్‌ఒ జి.బాపిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోకవరం

పురుగు మందు తాగి ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం...మండలంలోని రంపఎర్రంపాలెం గ్రామానికి చెందిన సన్నపు నాగేంద్రుడు (50) తన ఇంటి వద్దే గురువారం పురుగుల మందును తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని కుటుంబీకులు గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలీని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో భక్తాంజనేయ స్వామి స్నాన ఘట్టం సమీపంలో గోదావరి నదిలో గురువారం సాయంత్రం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుని వయస్సు సుమారు 45 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. నలుపు రంగు టీ షర్టు ధరించి ఉన్నాడని, మృతుని వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదని పట్టణ సిఐ పి.విశ్వరం తెలిపారు. వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీస్ స్టేషన్‌లో లేదా 9440796622 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

మండలంలోని సుభద్రపాలెం గ్రామానికి చెందిన తిప్పనబోయిన శ్రీనివాసరావు(35) విద్యుద్ఘాతంతో మృతి చెందాడు. గురువారం ఉదయం అదే గ్రామంలోని ఒక రైతు పొలంలో పామాయిల్ గెలలు కోసేందుకు కూలికి వెళ్లిన శ్రీనివాసరావు విద్యుత్ వైర్లకు కత్తి తగలంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లజర్ల పోలీసులు తెలిపారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

ఏడాదిలో అన్ని రంగాల్లో అభివద్ధి సాధిస్తూ అభివృద్ధికి నిదర్శనంగా గా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట, పెద్దాపురంలో పలు అభివృద్ధి పనులను గురువారం డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామితో కలిసి ఎంఎల్‌ఎ చినరాజప్ప ప్రారంభించారు. సామర్లకోట మండలంలోని పనసపాడు, పి.వేమవరంలో సిసి రోడ్లకు, సిసి డ్రైన్లను ప్రారభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.హిమ మహేశ్వరి పాల్గొన్నారు.

అనాథ బాలల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 7వ అదనపు జిల్లా కోర్టు జడ్జి జి.చంద్రమౌళీశ్వరి ఆదేశాల మేరకు వడ్లమూరులో అనాథ, వీధి బాల బాలికలు, వలస జీవులు, యాచకుల పిల్లల గుర్తింపునకు సంబంధించి మండల సర్వీసెస్ కమిటీ న్యాయవాదులు, వాలంటీర్లు గురువారం సర్వే నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో గ్రామ సర్పంచ్ దేవళ్ల దుర్గావరలక్ష్మి దేవి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ చంద్రకళ మాట్లాడుతూ, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్ల సాయంతో గ్రామం మొత్తం సమగ్ర సర్వే నిర్వహించి సమాచారం సేకరించామన్నారు. సచివాలయ కార్యదర్శి కళావతి, ప్యానల్ న్యాయవాదులు మడికి రాంబాబు, సకురు దుర్గారావు, గణేష్, వల్లూరి సత్యవతి, పారా లీగల్ వాలంటీర్లు, బి.సూర్యనారాయణ మూర్తి, కొమ్మోజు లక్ష్మి, నూతలపాటి అప్పలకొండ, మాసా చంద్రరావు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ తాగునీరు అందిస్తాం

ప్రజాశక్తి - జగ్గంపేట

నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ శుద్ధి చేసిన తాగునీరు అందిస్తామని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ హామీ ఇచ్చారు. రూ.6.34 కోట్ల జలజీవన్ మిషన్ నిధుల ద్వారా మండల కేంద్రమైన జగ్గంపేటలో నిర్మించిన రెండు వాటర్ ట్యాంక్‌లను గురువారం ఎంఎల్‌ఎ ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ తాగునీరు అందించే విధంగా ప్రణాళికలు తయారు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్,కొత్త వెంకటేశ్వరరావు, బండారు రాజా, ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, పాంద్రంకి రాంబాబు, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామ్‌జీ పాల్గొన్నారు.

పంట భూములను గుల్ల చేశారు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

పంట భూమిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతుల భూముల్లో కార్పొరేట్ సంస్థకు చెందిన వ్యక్తులు భూములను ధ్వంసం చేశారని ఇసుకపల్లి, ఉప్పరగూడెంకు చెందిన పలువురు రైతులు వాపోయారు. గంటా సత్యనారాయణ, శ్రీను, నాగమణి, సనిబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ.. మట్టి పరీక్ష చేసేందుకు అనుమతులు ఉన్నాయని కొంతమంది వచ్చి తొమ్మిది అంగుళాల వెడల్పు, 155 అడుగుల లోతు తవ్వుకుంటూ వెళ్లారని 100 అడుగులు లోతు వెళ్ళగానే రాయి పడటంతో బాంబులు సైతం అమర్చి పేల్చడంతో పలు ఇళ్ల పెంకులు సైతం ధ్వంసం అయ్యాయని వాపోయారు. రైతులు వారిని నిలదీయడంతో గోతులు తవ్వేందుకు అనుమతులు ఉన్నాయని తెలిపారన్నారు. రైతులకు సమాచారం లేకుండానే భూములన్ని గుల్ల చేశారని రైతులు వాపోయారు.

ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవొద్దు

ప్రజాశక్తి-కిర్లంపూడి

కూటమి ప్రభుత్వం ఘనవిజయం సాధించి ప్రమాణస్వీకారం చేసి అధికారంలోకి వచ్చి నేటికి సంవత్సరం పూర్తయిన సందర్భంగా పాటంశెట్టి సూర్యచంద్ర శుభాకాంక్షలు తెలిపారు. కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గురువారం ఆయన పర్యటించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంచానికే పరిమితమైన ప్రతి ఒక్కరికీ రూ.15000 పింఛను అందజేస్తామని ఎన్నికల ముందు చెప్పారని, గత 12 నెలల నుంచి రూ.15 వేల పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారని వాపోయారు. విజయోత్సవాలు చేసుకోవడం తప్పుకాదని, ప్రతిక్షణం బాధ్యతతో బాధితులకు న్యాయం జరిగేలా ప్రయత్నిస్తూ మంచి పరిపాలన అందించాలని సూచించారు.

హైవేపై స్టాపర్లు ఏర్పాటు

ప్రజాశక్తి - జగ్గంపేట

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా స్థానిక జెవియర్ జంక్షన్‌లో పోలీసులు స్టాపర్లు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతాన్ని పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు పరిశీలించారు. రాత్రి సమయాల్లో అతి వేగంతో హైవేపై వాహనాలు ప్రయాణిస్తూ రోడ్డు దాటుతున్న వారిని ఢీకొంటున్నాయని, వాటిని నివారించేందుకు రేడియం స్టిక్కర్లతో బైర్లను ఏర్పాటు చేశామని డిఎస్‌పికి ఎస్ఐ రఘునాథరావు వివరించారు.

సామాజిక రుగ్మతగా బాల కార్మికుల వ్యవస్థ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్, యు.కొత్తపల్లి

బాలల జీవితాన్ని, గౌరవాన్ని సర్వనాశనం చేసే సామాజిక రుగ్మతగా బాల కార్మికుల వ్యవస్థ కొనసాగుతుందని దీనిని అధిగమించాలని ఐసిడిఎస్ పీడీ కుమారి కె.విజయ కుమారి పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం నేపథ్యంలో ఆమె మాట్లాడారు. తల్లిదండ్రుల పేదరికం, నిరక్షరాస్యత కారణంగా ఎందరో బాలలు కార్మికులుగా జీవిస్తున్నారని అన్నారు. కొన్ని సందర్భాలలో పెద్దలు చేయాల్సిన పనులను పిల్లలతో చేయిస్తున్నారని అన్నారు. అసలైన బాల్యం మాధుర్యాన్ని వారు ఆస్వాదించలేకపోతున్నారని అన్నారు. సిడిపిఒ వై.లక్ష్మి, జిల్లా బాలల సంక్షేమాధికారి సిహెచ్.వెంకటరావు, సూపర్‌వైజర్ మార్తమ్మ, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, శిరీష, ప్రసాద్ నాయుడు, ఎస్.శ్రీనగేష్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి 14 ఏళ్లలోపు పిల్లలతో పని చేయిస్తే చట్టరీత్యా శిక్షార్హులని జిల్లా బాలల పరిరక్షణ విభాగ కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసిడిఎస్ పిఠాపురం ప్రాజెక్ట్ విస్తరణాధికారి ఎస్.లలిత నిర్మల అన్నారు. గురువారం అంతర్జాతీయ బాలల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి కె.విజయ కుమారి ఆదేశాల మేరకు మూలపేటలో జిల్లా పరిషత్ హైస్కూల్లో పిఠాపురం ప్రాజెక్ట్ సిడిపిఒ కె.దుర్గా దేవి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం జి.సత్యనారాయణ, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు, పాఠశాల సిబ్బంది, అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రభుత్వ పథకాలపై క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మహిళలకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర శ్రేయస్సు, ప్రజాహితాన్ని దష్టిలో పెట్టుకుని దార్శనికుడు, అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఐక్యంగా నవ్యాంధ్రను అభివద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణ రాజు, ప్రసాద్ నాయుడు, ఎస్.శ్రీనగేష్, శిరీష, రాజా, అడబాల సత్యనారాయణ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

13, 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 13, 14 తేదీల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందని ట్రాన్స్‌కో ఇఇ ఎస్.ప్రభాకర్ తెలిపారు. సామర్లకోట-పిఠాపురం రోడ్డులోని బ్రౌన్ పేట సెంటర్ నుంచి కోదండరామపురం వరకూ ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాల లైన్లో మార్పునకు సంబంధించి అత్యవసర పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ అంతరాయం కలుగుతుందని తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా జరిగే విద్యుత్తు లైను విద్యుత్ స్తంభాల మార్పు కారణంగా సామర్లకోట సబ్ స్టేషన్ 33/11 కెవి పరిధిలోని ఉప్పువారి సత్రం నుంచి వచ్చే 11 కెవి ఫీడర్లు, టిడ్కో అపార్ట్మెంట్స్, పిఠాపురం రోడ్డు, 11 కెవి.జల్లూరు అగ్రికల్చర్ ఫీడర్, పిఠాపురం రోడ్డు వ్యవసాయ రైతులకు, విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఆలోచింపజేసిన 'ఇగో' నాటకం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

తిరుమాలిలో నేరెళ్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ప్రదర్శించిన 'ఇగో' నాటకం ఆహూతులను ఆలోచింపజేసింది. సమాజంలో టీనేజర్స్ తీసుకునే అనాలోచిత నిర్ణయాల వల్ల ఆ కుటుంబాలు పడే ఆవేదనను నటీనటులు కళ్లకు కట్టినట్టు చూపించారు. ఈ నాటకం రచయిత, డైరెక్టర్ కట్ట వెంకటేశ్వరరావు (శ్రీను) మాట్లాడుతూ సమాజంలో రుగ్మతలను రూపుమాపేందుకు నాటకాలు, ఇతర కళా వ్యవస్థలు దోహదం చేస్తాయన్నారు. ముఖ్యంగా టీనేజర్స్ మాయమాటలకు లొంగి తెలిసీ తెలియని వయసులో చేసే తప్పులను ఇతివృత్తంగా తీసుకొని ఈ నాటకం రచించారని తెలిపారు. వెంకటేశ్వరరావును గ్రామ పెద్దలు సూతి వీరప్రభాకర్, చందువోలు రాజా, ఉత్సవ నిర్వాహకులు అభినందించారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఇంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. స్కూలు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా స్కూలు కమిటీ ఛైర్మన్ కాళ్ళ లక్ష్మణరావు, జనసేన నాయకులు గవర శ్రీరాములు, టిడిపి నాయకులు వాసంశెట్టి అంజిబాబు మాట్లాడారు. పాఠశాలలో భోజనం వండడం వల్ల విద్యార్థులు ఎక్కువమంది భోజనం చేస్తారని, దానివల్ల హాజరు శాతం మెరుగు పడుతుందన్నారు. మాజీ ఎంపిటిసి మాసుమేను గంగయ్య విద్యార్థులకు స్వీట్స్, పెరుగు పంపిణీ చేశారు. గవర శ్రీరాములు ప్రత్యేకమైన కూర వండించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుత్తుల రామలింగేశ్వర రావు, టిడిపి నాయకులు పంపన బుజ్జి, పిల్లి రమణమ్మ, స్వర్ణ రామారావు, సూతి శ్రీనివాస్, జనసేన నాయకులు దొడ్డిపట్ల అప్పారావు, రాయుడు శ్రీను, బయ్యా విశ్వేశ్వరరావు, శీల అర్జునరావు, పలివెల వీరబాబు, హెచ్‌ఎం ఐజాక్ పాల్గొన్నారు.

37వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 37వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం సెంటర్‌లో నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ శిబిరంలో యూనియన్ అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు, బాసిన భద్రరావు, వాకాడ భాస్కరరావు, ఆకుల రామకృష్ణ, అయ్యప్పస్వామి, కె.వెంకటరమణ, సోనియా, ఎన్.సూర్య ప్రకాష్, టి.ప్రశాంత్, ఎన్.శివకుమార్, ఎం.అరుణ్ కుమార్, సత్తిరాజు, ఎస్‌కె.బషీర్ పాల్గొన్నారు. సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సమ్మెలో యూనియన్ అధ్యక్షులు కొండవీటి రామరాజు, ఉపాధ్యక్షులు కష్ణ, నాయకులు మేడిపోయిన రమణ, రత్నరాజు, రమేష్, కురుకూరి మురళీకష్ణ, చిక్కాల నాగార్జున, ఉండవల్లి రామరాజు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, స్వామి, వారా సన్నీ బాబు,రమణమూర్తి పాల్గొన్నారు.

పని గంటల పెంపునకు నిరసనగా ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

పని గంటల పెంపుదలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని నిరసిస్తూ గురువారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి డి.క్రాంతి కుమార్ మాట్లాడుతూ కార్మికవర్గం ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచడాన్ని ఆయన దుయ్యబట్టారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లుగా మార్చడానికి ప్రయత్నిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం 10 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టడం అన్యాయమన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ, నీలపాల సూరిబాబు, తాడిశెట్టి గంగ, వడ్డి సత్యనారాయణ, లోవ కుమారి, సీతామహాలక్ష్మి, కె.మహాక్ష్మి, వేణి, చిన్నారి, మణి కుమారి, సోనియా, ఇందిరా, గీత, జ్ఞానేశ్వరి, అచ్చియమ్మ, లక్ష్మి, సిరపరపు శ్రీనివాస్, రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, చల్లా విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-రౌతులపూడి

రాజవరంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు గురువారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సారా, జూదం నిర్వహణ, వివాదాలు వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు లాలం కృష్ణవేణి, ఎంపిటిసి ఈగల నాని, ఉపేంద్ర ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

యువత క్రీడల్లో రాణించాలని కోరాడ సుబ్బారావు అన్నారు. కోరాడ శ్రీనివాస్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను సుబ్బారావు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తన కుమారుడికి క్రికెట్ అంటే అభిమానమన్నారు. తన కుమారుడు జనవరి నెలలో మరణించగా, అతడి మిత్రులు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ టోర్నమెంట్లో 34 టీంలు పాల్గొనడం జరుగుతుందని సుబ్బారావు తెలిపారు.

సత్యదేవునికి వెండి ఆభరణం అందజేత

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామికి వెండితో చేసిన మకర తోరణం ఆభరణాన్ని దేవస్థానం వ్రత పురోహితులు గురువారం విరాళంగా ఇచ్చారు. సూపర్‌వైజర్లు నాగబట్ల రవి బ్యాచ్‌కు సంబంధించిన 43 మంది పురోహితులు కలిసి 2.345 కేజీల వెండితో సుమారు రూ.మూడు లక్షల విలువైన ఆభరణాన్ని దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావుకు అందజేశారు. అల్లరి శ్రీనివాస్, గుత్తిన రామకృష్ణ పాల్గొన్నారు

క్వారీ తవ్వకాలపై గ్రామసభ

ప్రజాశక్తి-రౌతులపూడి

మండలంలోని ఎస్.పైడిపాలలో సర్వే నెంబర్ 15లో నల్ల రాతి క్వారీ తవ్వకాలకు నిర్వహణకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న విషయమై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఆర్‌డిఒ శ్రీరమణి హాజరై స్థానికుల నుంచి అభిప్రాయాలు సేకరించారు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి, మౌలిక సదుపాయాలు కల్పన, పర్యావరణ సమస్యలు నివారణ, అధిక బరువుతో భారీ వాహనాల రవాణా పాఠశాల వేళల్లో వాహనాలు నిలుపుదలపై పలువురు సూచించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని ఆర్‌బి.కొత్తూరులో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, డిక్షనరీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముందు ఆయన పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిమిత్తం వచ్చిన బియ్యం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బియ్యానికి సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట బ్రౌన్‌పేట, అయోధ్యరాపురం సెక్టార్ల పరిధిలో 'అంగన్వాడీ పిలుస్తోంది' కార్యక్రమాలు గురువారం ఘనంగా చేపట్టారు. సెక్టర్ సూపర్వైజర్లు ఎండి సుల్తానా బీబీ, ఉమాదేవి ఆధ్వర్యంలో బ్రౌన్ పేట, అయోధ్యరాపురం సెక్టర్ల పరిధిలో తొలుత అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం ద్వారా అంగన్వాడీలు ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ ప్రి స్కూల్లో చేర్పించాలని నినాదాలు చేశారు. అనంతరం స్థానిక బలుసులపేటలోని నూతన సామర్లకోట ప్రాజెక్టు కార్యాలయంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు.

జగ్గంపేట రాజపూడి, జె.కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసిడిఎస్ పిఒ ఎం.పూర్ణిమ ఆధ్వర్యంలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సహాయకులు, తల్లులు పాల్గొన్నారు.

ఘనంగా కూటమి ప్రభుత్వ సంబరాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా సంబరాలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

పెద్దాపురం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తోందని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, కాకినాడ రామారావు, ఎలిశెట్టి నాని, అడబాల కుమారస్వామి, మొయిళ్ల కృష్ణమూర్తి, రంధి సత్యనారాయణ, నూనె రామారావు, కందుల విశ్వేశ్వరరావు, అరవింద కుమార్, ఆరిఫ్ ఆలీ, యాళ్ల వీరబాబు, రేలంగి వెంకటరావు, జల్దాన్ని సుబ్రహ్మణ్యం, పచ్చిపాల సతీష్, బి రామలక్ష్మి పాల్గొన్నారు.

జగ్గంపేట మండలంలోని రామవరం మీదుగా జగ్గంపేట వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ పలు ప్రారంభోత్సవాలు చేసి గండేపల్లి మండలం వైపు ర్యాలీ కొనసాగింది.



ప్రత్తిపాడులో ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్‌ఎ సత్యప్రభ

పెద్దాపురం డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అత్తిం వీరభద్ర రావు ఆధ్వర్యంలో స్వర్ణకారుల కమ్యూనిటీ హాలులో కేక్ కోసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబును ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. రాజా సూరిబాబు రాజు, కూటమి నాయకులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, అడబాల కుమారస్వామి, కటారి శ్రీను, లక్ష్మణ్ దివాకర్, అత్తిం రమేష్, రాజేష్, వంగలపూడి సతీష్, కందుల వెంకటచలం, పెదిరెడ్ల రామకృష్ణ, పాల్గొన్నారు.

ప్రత్తిపాడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తామని ఎంఎల్‌ఎ వరుపుల సత్య ప్రభ అన్నారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలో తన స్వగ్రామం పెదశంకర్లపూడి నుంచి అన్నవరం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభలో ఎంఎల్‌ఎ మాట్లాడుతూ తన భర్త వరుపుల రాజా ఆశయాలను నెరవేర్చడమే లక్ష్యంగా నియోజకవర్గ అభివృద్ధికి పని చేస్తానన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి చేయకుండా గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేశారని, ఎన్నికల సమయంలో గ్రామాల్లో తిరిగినప్పుడు ఉన్న సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కారం దిశగా గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి కోట్ల రూపాయలు నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, వెన్నా శివ, పర్వత సురేష్, యాళ్ల విశ్వేశ్వరరావు సోమరౌతు చంద్రమౌళి, సుంకర భవాని పాల్గొన్నారు.

తాళ్లరేవు టిడిపి కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు కేక్ కట్ చేసి కూటమి నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. అనంతరం ఎంఎలఎ సుబ్బరాజు మాట్లాడారు. కోరంగిలోని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ధూళిపూడి వెంకటరమణ, సాగి బాబ్జీ రాజు, నడింపల్లి వినోద్, టేకుమూడి లక్ష్మణరావు, వుంగరాల వెంకటేశ్వరరావు, మందాల గంగ సూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, కట్టా త్రిమూర్తులు, ముత్యాల జయలక్ష్మి, విత్తనాల కరిమల స్వామి, వాసంశెట్టి శ్రీనివాస్, పెసింగి ఈశ్వరరావు, మల్లాడి వరదరాజు, వైదాడి శ్రీనివాస్, వెంటపల్లి ఉమామహేశ్వరి, పితాని హేమలత, పెమ్మాడి కష్ణవేణి, రోళ్ల చక్రవర్తి, గంజా సూరిబాబు, కుడుపూడి దుర్గా ప్రసాద్, వడ్డి విజయ్, వస్కా రెడ్డి, గంటా గోపి, జవ్వాది తాతాజీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గండేపల్లి రాష్ట్ర రాజకీయాలలో సునామీ సృష్టించిన కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తవడంతో జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూని జెడ్ రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పోతుల మోహన్ రావు, ఎస్‌విఎస్.అప్పలరాజు, అడబాల భాస్కరరావు, జాస్తి వసంత్, బొల్లం రెడ్డి రామకృష్ణ, అడబాల ఆంజనేయులు, శిలామంతుల వీరబాబు, తమటం నాగేంద్ర పాల్గొన్నారు.



పెద్దాపురం సభలో ప్రసంగిస్తున్న తుమ్మల బాబు

కరప టిడిపి సీనియర్ నాయకుడు చుండ్రు వెంకన్న రావు చౌదరి మండల కార్యాలయం వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయుకులు మద్దూరు స్వామి, పేపకాయల సత్తిబాబు, కాకర్ల బుజ్జి బాబు, రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, పంపన కన్నారు, కంటే సత్తిబాబు, చాట్ర ఇమ్మానియేలు, చీపురుపల్లి జయేంద్ర బాబు, మేడిశెట్టి పట్టాభి తదితరులు పాల్గొన్నారు

పిఠాపురం మాజీ ఎంఎలఎ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్‌ఎన్.వర్మ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక రాజుగారి కోటలోని పార్టీ కార్యాలయం నుంచి కోటగుమ్మం సెంటర్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.